# కాలే వెన్నెల

## పి.యస్.నారాయణ

రామాపురం దగ్గర నేషనల్ హైవేమీద కృష్ణకు బ్రిడ్జికడుతూ నన్ను అక్కడకు అసిస్టెంట్ ఇంజనీర్‌గా ట్రాన్స్ఫర్ చేసినప్పుడు నేను కాస్త అప్‌సెట్ అయినమాట వాస్తవమే !

కాని తప్పలేదు. అందుకే విజయవాడలో ఇల్లు తీసుకొని నేను రోజూ జావామీద పదిమైళ్ళదూరాన వున్న రామాపురానికి వెళ్ళిరావాలని నిర్ణయించుకున్నాను.

ఆ రోజు మొదటిరోజు...

రామాపురానికి బ్రిడ్జి కట్టేస్థలం రెండు మైళ్ళదూరాన వున్నది. సైటుదగ్గరే ఆఫీసుకుగాను కాలువపక్కగా ఓ రేకుల షెడ్డు వేశారు. పెద్ద ఆవరణ. ఇప్పుడిప్పుడే తలలెత్తుతున్న చిన్న చిన్న పూలచెట్లు వరసగా వున్నాయి. ఆఫీసు అనబడే ఆ పెద్ద రేకుల షెడ్డుకు దూరంగా చిన్న చిన్న రేకుల షెడ్లు, చాలా పూరిగుడిసెలు ... అవి మేస్త్రీలకూ, కూలీలకు ఇళ్ళు.

నేను వచ్చిన అయిదు నిముషాలలోనే జేయీలు, సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, కాంట్రాక్టరు వచ్చారు నా దర్శనార్థం... పరిచయాలయినయి ... అందులో ఒక జేయీ నాకు తెలిసినతనే ... అంతకు ముందు సాగర్‌లో నా దగ్గర కొంత కాలం పనిచేశాడు ... పేరు చిదంబరం ...మంచివాడే ... నా రాకకు అత్యంత ఆనందాన్ని వ్యక్తంచేసిన వాళ్ళలో అతడు ప్రథముడు.

కాఫీ వచ్చింది. అంత బాగాలేదు. త్రాగుతుంటే చిదంబరమే అన్నాడు, "ఇదే అమృతం ఇక్కడ !" అని.

బయటకు వచ్చేటప్పటికి పక్కగా పారుతున్న కృష్ణలో నీళ్ళు ఎండాకాలపు సూర్యకిరణాలకు తళతళా మెరిసిపోతున్నాయి. కాలవలో నీళ్ళకంటే యిసుకే ఎక్కువగా కనబడుతున్నది. ఓ పక్కగా నీళ్ళలో నాటుపడవలు ఒడ్డున కట్టేసి వున్నాయి.

"వెళ్దామా !" చిదంబరం వెనగ్గా వచ్చాడు.

అప్పటికే కాంట్రాక్టర్లూ, సూపర్‌వైజర్లూ ముందుకు నడుస్తున్నారు.

చిదంబరం నా పక్కగా నడుస్తున్నాడు.

యిసుకలో అడుగులు స్వేచ్ఛగా పడటంలేదు. కూలీలు పనులాపేసి కొత్తగా వచ్చిన నన్ను చూస్తున్నారు. వాళ్ళ మాటల్నిబట్టి, వాళ్ళ నడకను బట్టి నా కర్థమయింది – వాళ్ళందరిమీద నేను చాలా పెద్ద ఆఫీసర్నని వాళ్ళకు తెలిసిపోయిందని ... నమస్కారాల బాణాల తాకిడికి తట్టుకోలేని నేను చేయి ఎత్తటం ఆపేసి తల ఊపటంతోటే సరిపుచ్చుతున్నాను.

సైటులో ఎర్త్‌వర్క్ జోరుగా సాగుతోంది. చిదంబరం ప్లాను విప్పి పట్టుకున్నాడు. ఆఖరి పిల్లర్ దగ్గర ఇంకా పని మొదలవ్వలేదు. మార్కింగ్ యిచ్చారు. మార్కింగ్ యిచ్చినచోట నిలబడి పైకి చూస్తే దూరంగా విజయవాడ కొండ నల్లగా కనబడుతోంది. ఓ పక్కగా పచ్చని పొలాలు... అక్కడక్కడా తాటిచెట్లు పొలాలకు కాపలా కాస్తున్నట్లున్నాయి.

అప్పటికే సూర్యుడు నడినెత్తిపై కొచ్చేశాడు. అవుట్‌డోర్‌లో పని ఈ మధ్య అలవాటు తప్పిందేమో ఎండ అనీజీగా వున్నది – హేట్ కొనుక్కోవాలి !

వెనక్కు తిరిగాం. అప్పుడే మొట్టమొదటిసారిగా గణేష్‌ను చూడటం జరిగింది.

"గుడ్‌మార్నింగ్ సర్ ... నన్ను గణేష్ అంటారు !"

"ఏంచేస్తుంటావ్ ?"

"లేబర్ సప్లయి అండీ !"

"ఎంతమంది వున్నారేం నీ దగ్గర?"

"మీ కెంతమంది కావాలో చెప్పండి ... వంద కావాలన్నా...వెయ్యి కావాలన్నా సరే... రెండురోజులు టయిమిస్తే పదివేలమందినయినా మీ ముందు హాజరుపరచగలను!" నవ్వాడు పెద్దగా.

గారపట్టిన పళ్ళు అసహ్యంగా కనబడగా ... ఆ మనిషిమీద, అతడి మాటల్లోని నిజాయితీమీద నాకు అంతగా నమ్మకం చిక్కలేదు.

"అలాగా !" అంటూ ముందుకు వచ్చేశాను.

'గణేష్ కాస్త కనిపెట్టి వుండవల్సిన మనిషి...ఫరవాలేదు... నా సర్వీసులో ఇలాంటి లోకరాగాళ్ళను చాలామందిని చూశాను !'

ఆఫీసు అనబడే రేకులషెడ్డులోకి అందరం వచ్చేశాం తిరిగి.

లోపలకు అడుగుపెడుతూండగా లోపలినుంచి హడావుడిగా ఓ ఆడ మనిషి బయటకువస్తూ నన్ను చూసి కలవరపడుతూనే పక్కకు తప్పుకున్నది.

"కూజా కడిగి నీళ్లు పెట్టావా ?" చిదంబరం అడిగాడు.

"పెట్టానండి !"

"గ్లాసు ?"

"అది గూడా వున్నదండి !"

నల్లగా పొడుగ్గా వున్నది. పెద్దపెద్ద కళ్ళు... అంత లావూగాదు, సన్నమూ గాదు...ఒక్కసారి చూస్తే మరోసారి—మరోసారి—వెనుతిరిగి చూడాలనిపించేలా వున్నది. పక్కకు తప్పుకుంటున్నప్పుడు చెట్టుచాటున దాక్కున్న నల్లటి నాగు ఒక్కసారి తొంగిచూసినట్లుగా ఆమె పొడవైన జడ మెలికలు తిరుగుతూ కనబడి మాయమయింది.

వెళ్ళి సీట్లో కూర్చున్నాను.

"మీ భోజనం సంగతి !" ఎదురుగ్గా చిదంబరం.

"ఇవాల్టికి ఇంటికి వెళ్ళటమే... సీత భోజనం చేయకుండా ఎదురుచూస్తూ కూర్చొని వుంటుంది ... రేపట్నించి కేరియర్ తెస్తాను !"

"మంచిది ... అక్కయ్యగారికి నా నమస్కారాలు చెప్పండి."

* * *

మరునాడుదయం తొమ్మిదిగంటలకల్లా సైటుదగ్గరకు వచ్చేశాను జావా మీద. లోపలికి అడుగులు వేస్తుంటే నిన్నటిలాగానే ఇవాళ ఆ ఆడమనిషి ఎదురువచ్చి హడావుడిగా పక్కకు తప్పుకున్నది. సూటిగా చూశాను ఆమె కళ్ళల్లోకి. పెద్ద పెద్ద కళ్లు. భయంగా నన్ను చూస్తూనే రెప్పలు టపటప లాడించింది.

ఇంకా చిదంబరం రాలేదు.

కూర్చుంటూనే బెల్ కొట్టాను. ఆ అమ్మాయివస్తే బాగుంటుందనిపించింది.

ఆ అమ్మాయే వచ్చింది !

"నీ పేరు ?"

"నాగుమణి !"



"ఏం చేస్తుంటావ్ ఇక్కడ ?"

"ఆఫీసు ఊడ్చి మంచినీళ్ళు పెడుతుంటాను ... కాఫీలూ అవీ కావాలంటే తెచ్చి పెడుతుంటాను !"

చిదంబరం వచ్చాడు, "నమస్కారం!" అంటూ లోపలికి. "నిన్న మీరొచ్చి వెళ్ళిన తరువాత యీయీగారు వచ్చారు ...ప్రత్యేకంగా ఇక్కడి కనికాదు ... పై సర్కిల్లో ఇన్స్పెక్షన్ వుండి వెళ్ళారట... వస్తూ వస్తూ ఇటు వచ్చారు... మీరు కలిశారటగా మొన్న !"

" అవును ! ఏఁవన్నాడేం ... " యీయీ వచ్చినప్పుడు నేను సైట్ దగ్గర లేకపోవటం కించిత్ బాధనే కలిగించింది.

"చెప్పాను ... నిన్ననేగదా జేరింది ... భోజనానికి వెళ్ళారని చెప్పాను !"

"దట్సాల్‌రైట్ !...నేనేదో నా పై ఉద్యోగికి భయపడిపోతున్నట్లుగా నా క్రింది ఉద్యోగి అనుకోవటం నా కిష్టం లేదు. లేచి నిలబడుతూ, "లాస్ట్‌పిల్లర్ దగ్గర ఎర్త్‌వర్క్ మొదలయిందా !" అన్నాను.

"పదఁడి...ఈ రోజు మొదలుపెట్టి వుండాలి...ఇంకా అటు వెళ్ళలేదు నేను!"

బయటకు వస్తుంటే నాగుమణి రెండు గ్లాసులతో కాఫీ పట్టుకొచ్చింది. మరో వైపునుంచి హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ నిన్నటి డాక్ పట్టుకువచ్చాడు. నిల్చునే డాక్ చూశాను. అంతముఖ్యమయిన కాగితాలేం లేవు. డాక్ చూస్తూనే నాగుమణిని గమనిస్తున్నాను. చీరచెంగుతో గ్లాసుల అడుగు తుడిచి బల్లమీద పెట్టేసి బయటకు వెళ్ళిపోయింది.

కాఫీ త్రాగి బయటకు వచ్చేటప్పటికి మేమేదో ఆలస్యంచేసి తప్పుచేసినట్టుగా సూర్యుడు మండిపడుతున్నాడు- నిన్ననే కొని వుండవల్సింది హేట్.

దారిలో నమస్కారాలు ... గుడ్ మార్నింగ్‌లూ.

గణేష్ ఎవర్నో అరుస్తూ కనబడ్డాడు. అప్పటికే ఓ పదిమంది జనం పోగయి వున్నారు అక్కడ.

నన్ను చూస్తూనే చాలామంది ఏదో పనివున్న వాళ్ళలా అక్కడినుంచి

తప్పుకుపోయారు. గణేషూ ఓ పదేళ్ళ పిల్లవాడు మాత్రం మిగిలిపోయారు. గణేష్ అరుస్తున్నది ఆ పిల్లవాడినే. వాడిని నిన్న సాయంత్రం అక్కడకు రెండుమైళ్ళదూరంలో వున్న ఏదో ఊరికి వెళ్ళి వందమంది కూలీలను రమ్మనమని చెప్పి రమ్మన్నాడట. వీడెళ్ళేటప్పటికి అక్కడ మేస్త్రీ లేడట ... ఓ పావుగంట చూసి వాడు వొచ్చేశాడట ... మేస్త్రీ వచ్చేటంతవరకూ వుండి ఎందుకు చెప్పిరాలేదని కేకలు వేస్తున్నాడు. "చూడండి సార్ ! జేయీ గారికి నేనిచ్చిన మాట పోయినట్లేనా... నా మీద నమ్మకం పోవటానికి ఇలాంటివి రెండు జరిగితే చాలు సార్ ... గణేష్ ఇంతవరకూ ఎవరిచేతా మాట పడ్డవాడు కాదు ... ఈ దరిద్రగొట్టు వెధవను పంపిస్తే చేసుకువచ్చిన ఘనకార్యం ఇది ... సింగడు అద్దంకి వెళ్ళనూ వెళ్ళాడు రానూ వచ్చాడు ... మన్నించండి సార్ ... లాస్ట్ పిల్లర్‌దగ్గర వర్క్ రేపు మొదలెడతాం ... సాయంత్రం నేనే వెళ్ళి చెప్పివస్తాను!"

పిల్లాడు మావైపుకు బిక్కముఖంతో చూస్తున్నాడు.

మొదటి ఆరు పిల్లర్స్‌కూ అప్పుడే నిలువెత్తు లోతు గుంటలు తవ్వేశారు... ఒకవైపు తవ్వుతుంటే మరోవైపు నీళ్ళూరుతున్నాయి...తోడి పోస్తున్నారు.

ఇంకాస్త ముందుకు వెళ్ళాం... దూరంగా కృష్ణమీదుగా నడుస్తూ పడమటికి వెళుతున్న లాంచి ... దాని మీద నీడల్లా మనుష్యులు ... పడమట పొలాలమీదుగా ఎగురుతున్న తెల్లటి కొంగల గుంపులు.

జీవితం అందమైన కాన్వాస్ ... దానికి అలంకరణలే ఈ పరిసరాలు....

ఓ పక్కగా నీళ్ళులేనిచోట లారీల్లోకి ఎక్కిస్తున్న ఇసుక ... తూర్పువడ్డున గుడ్డ ఉతుకుతున్న చాకలివాళ్ళు....

సంవత్సరంపాటు ఈ పరిసరాలకే అంకితమవ్వబోతున్న జీవితం ...బ్రిడ్జి పూర్తిచేసి ట్రాఫిక్కుకు అందిస్తే తన బాధ్యత నెరవేరినట్లే.

చిదంబరం కూలీల మధ్యకు వెళ్ళిపోయాడు. వెనుదిరిగి వస్తుంటే ఇందాక గణేష్ చేతిలో చివాట్లు తిన్న ఆ కుర్రవాడు చేతిలో ఓ తట్టతో ఎదురొస్తూ కనబడ్డాడు. వాడిని చూస్తే జాలేస్తోంది. నిండా పదేళ్లు లేవు ... అప్పుడే డబ్బు సంపాదన ... తట్టలు మొయ్యటం... గోతులు తవ్వటం.

"ఏరా చెప్పినపని సరిగ్గా చేయి... ఎందుకట్లా తిట్లు తింటావ్ ?" చిన్నగా అన్నాను.

వాడు ఒక్కసారి భయం భయంగా అటూ ఇటూ చూసి, "అంతా ఒట్టిదే సార్ ! వాడి బొంద ... త్రాగుబోతు వెధవ ... వాడు వెళ్ళమని చెబితేనా నాకు అసలు !" అంటూనే పరుగెత్తుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాలవరకూ ఆ యిసుకలో నాకు అడుగు పడనేలేదు... తరువాత కోలుకొని ఆఫీసు దగ్గరకు వచ్చేటప్పటికి గణేష్ నాగుమణితో ఏదో మాట్లాడుతూ కనబడ్డాడు.

గణేష్‌కు గురించి నా అంచనా అక్షరాలా కరెక్టే ... అతడు నమ్మలేని మనిషి !

నా గదిలోకి వచ్చి కూర్చొని బెల్ కొట్టాను.

నాగుమణి వచ్చింది.

"మంచినీళ్లు !"

తెచ్చిపెట్టింది.

"గణేష్ వుంటే పిలువు!" కరుకుగా అన్నాను.

ఒక్కక్షణం బయటకు వెళ్ళి వచ్చి, "లేడు సార్ ... వెళ్ళిపోయాడు !" అన్నది.

తలెత్తి నాగుమణి కళ్ళల్లోకి చూశాను ... ఆ పెద్ద కళ్ల అందాల్ని విరజిమ్ముతున్నాయి ... ఆ పైన అమాయకపు చూపులూ.

గణేష్ అంటే కోపం ఇంకా గుండెల్లోనుంచి ఎగతన్నుతూనే వున్నది. "జాగ్రత్త నాగుమణీ ! ... గణేష్ నీతో ఏదో మాట్లాడుతున్నాడు గదూ ... అతడితో జాగ్రత్తగా వుండు ... నాకు చూస్తే అతడు మంచివాడిలా కనుపించటంలేదు !" అన్నాను.

నాగుమణి తలవంచుకొని బయటకు వెళ్ళిపోయింది.

వెనగ్గా నల్లటి పొడుగాటి ఆమె ఊగుతున్న జడను చూస్తూ అలాగే కదలకుండా చాలాసేపు కూర్చున్నాను. నల్లటి నాగుమణికి, నల్లటి కాలనాగులా జడ ! – నాగుమణిని మరీ మరీ తలుచుకుంటే కాటేస్తుందా ?

ఉఁహూఁ ... ఆమెను తలుచుకోకుండా ఎలా వుండగలను ?

ఆమెలోని ఆకర్షణ తన మనస్సును ఆమెమీదకు పగ్గాలేసి లాగుతోంది. ఆమెనే చూస్తూ కూర్చోవా లనిపించేలా ఆమె కళ్ళల్లోని అయస్కాంతాలు నన్ను ఆకర్షిస్తున్నాయి.

చిదంబరం వచ్చాడు.

హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ వచ్చాడు.

ప్లాను ... కాగితాలు ... డ్రాయింగ్ పెన్సిల్స్... స్కేల్సు.

ఒంటిగంటవుతుండగా నాగుమణి వచ్చి పక్కనున్న టేబుల్‌ను శుభ్రంగా తుడిచి క్యారియర్, గాజుగ్లాసుతో నీళ్ళు, ఓ పింగాణీ ప్లేటుపెట్టి వెళ్ళింది. బీరువా తెరిచి ఓ తువ్వాల తీసి కుర్చీమీద పడేసింది.

తరువాత పది నిముషాలలోనే అందరూ వెళ్ళిపోయారు. ఆ రేకుల గదిలో నేనొక్కడినే కూర్చొని అక్కడే తచ్చాడుతున్న నాగుమణి కదలికలను ఆపేక్షగాపరిశీలిస్తున్నాను.ఆ పరిశీలనలో

ఆమె నా దొంగచూపులను పట్టేసిన మాటా నిజమే ... అయితే తన చూపుల్ని చటుక్కున పక్కకు తిప్పుకునేది వెంటనే బయటకు వెళ్ళితుందేమోనని భయపడ్డానుగాని ... అలా వెళ్ళిపోలేదు.

అంటే... ?!

అన్నీ సర్దింతరువాతే వాకిట్లోకి వెళ్ళిపోయింది.

నేను లేచి వరండాలో కొచ్చి చేతులు కడుక్కొని తువ్వాలతో తుడుచుకుంటూ లోపలికి వచ్చి క్యారియర్ ముందు కూర్చున్నాను.

—నాగుమణి ఎదురుగ్గా కూర్చొని వడ్డిస్తే ఎంత బాగుంటుంది?

అన్నీ కొద్దికొద్దిగా పెట్టుకొని తింటూ మారు వడ్డనకుగాను కావాలని "నాగుమణీ" అంటూ పిలిచాను.

"అయ్యా !" తలుపుదగ్గిరే నిలబడి వున్నదేమో వెంటనే వచ్చింది.

"అన్నంపెట్టి వెళ్ళు ... స్పూన్ కనబడటంలేదు !"

"వస్తా !" నంటూ దబదబా బయటకు వెళ్ళి రెండు క్షణాలలోనే కడుక్కున్న చేతుల్ని చీరె చెంగుకు తుడుచుకుంటూ వచ్చింది.

అన్నం వడ్డిస్తుండగా ఆమెనే చూస్తూ చిన్నగా అడిగాను, "ఎక్కడ వుండటం ?" అని.

తడబడుతూ అన్నది, "పడమట!"

"పిల్లలా ?"

"లేరయ్యా !" అన్నది తల వంచుకునే.

లేరు కాబట్టే అంత అందంగా వున్నది. వాలిపోతున్న ఆమె కళ్ళల్లోకి కళ్లుపెట్టి చూస్తూంటే నాకూ అనీజీగానే వున్నది.

మేం యిద్దరం ఇలా మాట్లాడుకుంటుండగా ఎవరైనా చూస్తే — ఈ డిపార్టుమెంటులో కథ అల్లుకుపోవటం క్షణాలమీద పని !



అందుకే భయంభయంగా ... "వెళ్లు ... వెళ్ళి వాకిట్లో కూర్చో !" అన్నాను.

"ఏమైనా కావాలంటే పిలవండయ్యా !"

నా కళ్ళల్లో మెరుపు — ఏం కావాలన్నా పిలవ్వచ్చా ! అర్థంలో విరుపు.

నా జీవితంమీద ఓ పెద్ద కుంచెతో ఓ డబ్బాడు రంగు విదిలించుకుంటున్నట్టే అనిపించింది. అన్నం త్వరత్వరగా హుషారుగా తినేశాను.

ఏదైనా జాగ్రత్తగా అడుగులు వేయాలి !

అన్నం తిని చేతులు తుడుచుకుంటుండగా గణేష్ వాకిట్లో నిలబడి కనబడ్డాడు.

నన్ను చూస్తూనే కాస్త వంగి, "నమస్కారమండీ !" అన్నాడు. 'అతి వినయం ధూర్తలక్షణం' అనే సూక్తి అతడికి అన్నివిధాలా సరిపోతుంది అనిపించింది నాకు.

"చెప్పు !" వెనక్కు తిరుగుతూ అన్నాను.

నా వెనకే వచ్చాడు. నేను తువ్వాలను కుర్చీమీద పడేసి, జేబులోనుంచి వక్కపొడి పొట్లం తీసి చించి వేసుకుంటూ, "ఏమిటి సంగతి ... లాస్ట్ పిల్లర్ దగ్గర పని మొదలయిందా ? ...ఎంతవరకు వచ్చింది !" అంటూ అడిగాను.

"లేదుగదా సార్ ... ఆ వెధవను నమ్మి అభాసపాలయ్యాను గదా !" అన్నాడు దీనంగా ముఖంపెట్టి.

నాకు తెల్సు అదంతా దొంగ నాటకమని.

"రేపు సాయంత్రానికల్లా పూర్తి చేస్తాను సార్ ... ఎక్కడా కూలీలే దొరకటంలేదు సార్...అంతా కోతలకు వెళుతున్నారు...ఎవ్వడి నడిగినా దొంగ ముండాకొడుకులు పదిస్తావా... పదకొండిస్తావా అనేవాళ్ళే... ఇక్కడా గవర్నమెంటు రేటు అయిదున్నర ... నేను పైసా మిగుల్చుకోకుండా - బోడిలాభం పోనీయండి - మాట నిలబడితే చాలని-అయిదున్నరా యిస్తానన్నా ఒక్క ముండాకొడుకూ వచ్చి చావడే...ఇలా వుంది మా కాంట్రాక్టర్ల పరిస్థితి ... సార్ ! మా పాతబిల్లులు అలాగే వున్నయ్యండి ... ఇన్నాళ్ళబట్టి మీరు వస్తారూ, వస్తారూ అంటూ ఆపేశారు... ఏదో మీరు..." నసుగుతున్నాడు - గారపట్టిన పళ్ళను బయటకు పెట్టి ఇకిలిస్తూ.

బెల్ కొడితే నాగమణి వచ్చింది : "అన్నం క్యారియర్ అవీ తీసేయ్ ... ఎవరన్నా వస్తుంటారు ... అసహ్యంగా వుంటుంది !"

"అలాగేనయ్యా !"

"అలాగే అంటే కాదు ... తీసేయ్యే ముందు ... అయ్యగారితో గిన్నెలు తీసేయమని పిలిచేలా చెప్పించుకోవాలా ...అన్నం తినగానే తీసెయ్యాలని తెలియదా ... సార్ కు కోప మొచ్చిందంటే నీ బోడి ఉద్యోగం నిముషాల్లో పుటుక్కుమంటుంది ! "పెద్దగా అరవసాగాడు వెనక్కు తిరిగి గణేష్.

ఎంత లేబర్ని సప్లయిచేసే కాంట్రాక్టరయినా - అందునా నాగమణికి ఈ భృతి కలిపించింది అతడే అయినా-ఆమెను అలా అరవటం నాకు కాస్త చికాకే కలిగించింది.

అయినా అతగాడి ముందు లోకువవ్వటం యిష్టంలేదన్నట్లుగా - ఇలాంటివన్నీ ఇక్కడ మామూలే అనుకుంటూ చూస్తూ ఊరుకుండిపోయాను.

గణేష్ ఇంకా వంగొనే మాట్లాడుతున్నాడు. కూర్చోమందామనుకున్నాను. కాని-అలాంటివాడికి మర్యాద నివ్వటం కోరి నెత్తికెక్కించుకోవటమే అనిపించింది.

"లాస్ట్ పిల్లర్ దగ్గర పని కూడా కానివ్వు ... బిల్లులు అలాగే పాస్ చేస్తాను !"

"అమ్మమ్మమ్మ... అలా అనే దానికంటే ఓ బారెడు తాడిప్పించండి... ఆ ఎదురుగ్గా వున్న చెట్టుకు ఉరేసుకు చస్తాను...రేపు శనివారం ... సాయంత్రానికి డబ్బులు రాకపోతే ఈ ముండాకొడుకులంతా కలిసి నన్ను ఈక్కు ఈక పీక్కు పీక లాగేసి ఎండేసి గద్దలకు ఎగరేస్తారు !"

అతడితో ఎక్కువ మాట్లాడటమే అసహ్యమనిపించింది. దానికి తోడు ఈ అధిక ప్రసంగం - "తాడు కావాలంటే స్టోర్సులో అడిగి తీసుకో ... నేను మాత్రం చేయగలిగిం దేమీలేదు !" అన్నాను కోపంగా.

గణేష్ ఫక్కున నవ్వాడు. "మంచి జోకేశారు సార్ !"

అప్పుడే చిదంబరం లోపలికి వచ్చాడు.

"గణేష్ బిల్లులేవో పాసు చేయాలిట గదా..." అడిగాను.

"ఆ విషయాలన్నీ చిదంబరం సార్ కు చెప్పాను సార్ !"

"ఏమిటా విషయాలు...?"

"అన్నీ సార్..." నసిగాడు ఇకిలిస్తూ.

"అవే ఏమిటంటున్నాను !"

"మీకు రావాల్సిన భాగం..." ఇంకా నసుగుతూనే వున్నాడు.

నాకు కళ్ళు తిరిగినంత పనయింది. నా సంగతి చిదంబరంకు బాగా తెలుసు. నేను తలుచుకుంటే "ఇలాంటివాళ్ళను వందమందిని నాకున్న ఆస్తితోనే కొనగలను ... డబ్బుకోసరం కక్కుర్తిపడే అవసరం నాకు లేదు ...అలాంటి ఆశా లేదు.

కోపాన్ని నిగ్రహించుకోలేనట్లుగా, "షటప్...గెటౌట్ ఫ్రం మై రూమ్ !" అరిచాను బిగ్గరగా.

గణేష్ బయటకు పరుగెత్తిన మాట వాస్తవమే.

నాలో అంత కోపాన్ని చిదంబరమూ అంతకు ముందెన్నడూ చూసి వుండలేదేమో తనూ నా ఎదుట కూర్చోలేనట్టుగా బయటకు వెళ్ళిపోయాడు.

* * *

నాలుగు రోజుల తరువాత ఓ ఉదయాన నాగమణిని చూడగానే మొట్టమొదటిసారిగా అనిపించింది — ఆమె రాత్రి నిద్రపోలేదూ అని!

అదే కాఫీ తెచ్చి యిస్తుండగా రూమ్‌లో ఎవ్వరూ లేకపోవటంతో

అడిగాను. సమాధానం చెప్పకుండానే తలవంచుకొని బయటకు వెళ్ళిపోయింది.


అసలే నల్లటిమనిషేమో ఇలా మరింత నల్లబడిపోయి ముఖమంతా కమిలిపోయి వున్నది. కళ్ళు ఎర్రగా వున్నాయి. ఈ రోజు ఉదయాన జుట్టుకూడా తీరిగ్గా కూర్చొని దువ్వుకొని జడవేసుకున్నట్లుగా లేదు.

భర్త తప్పతాగి వచ్చి తన్నలేదు గదా! వాళ్ళల్లో అది సహజమే... అయినా అయివుండవచ్చు...నాగుమణి చాలా ఆత్మాభిమానంగల స్త్రీ అనిపించింది నాకు ... లేకపోతే అడగగానే కారణం చెప్పి వుండేది.

మధ్యాహ్నం టేబుల్ మీద క్యారియర్ పెడుతున్నప్పుడు ఉదయపు ప్రశ్ననే మళ్ళీ వేశాను...అంతేగాదు సమాధానం చెప్పమని ఒకటి రెండుసార్లు ఒత్తిడి గూడా చేశాను. నేను అలా అడుగుతున్నప్పుడు ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగటం నేను గమనించకపోలేదు. నాకు జాలివేసింది. ఆమె గుండెల్లో భగ భగ మండే మంటల్ని ఆర్పేసుకునేటందుకన్నట్లుగా కన్నీరు కారుస్తున్నదేమో ననిపించింది నాకు.

ఆమె ఎవరు ? ఆమెకూ, నాకూ బాంధవ్య మేమున్నది ? ... నేను ఒక పెద్ద యింజనీర్ని ... ఆమె ఒక మామూలు రోజు కూలీ ... సాయంత్ర మయ్యేటప్పటికల్లా త్రాగి గుడిశెల్లో చిరిగిన చాపలమీద ఇది మంచిదీ ఇది కాదూ అని గూడా తెలియని పరిస్థితులలో దొర్లే మనిషి ... ఆమె బాధ పడితే నాకు బాధ దేనికి ?

కాని నా హృదయాంతరాలల్లో ఎక్కడో మానవత్వపు పొర నా గుండె లాగానే కదలాడుతున్నది. ఆమెను ఆత్మీయురాలిగా భావించాలా ? ... చెల్లెలనుకొని ఆత్మను వంచించుకోవాలా ? ... ఆమె ఊఁ ... అందే




ఆమె సర్వస్వాన్ని అపహరించి నా క్షణికోద్రేకాన్ని, ఆనందాన్ని శాశ్వత నీచత్వంలోకి దిగజార్చి భవిష్యత్తులో ఆ కొద్ది క్షణాలనే గుర్తుకు తెచ్చుకుంటూ, ఆనందిస్తూ, దుఃఖిస్తూ పరితపిస్తూ— డైరీపుటలు తిరగవేసుకుంటుండాలా ?

నాలోని బలహీనత విశృంఖాలతో విలయతాండవం చేసినప్పుడు నేనే గాదు — నా పరిస్థితులలోని ఎవ్వరైనా భవిష్యత్తుని గురించిగాని, నీచత్వాన్ని గురించిగాని ఆలోచించరు — అదే దేవుడు సృష్టించిన మనిషిలోని బలహీనత !

"చెప్పు నాగుమణీ ... ఎందుకు బాధపడుతున్నావ్ !"

"ఏం చెప్పమంటారయ్యా ! ... నేను ఎలా బ్రతకాలో నాకే అర్థం కావటంలేదు... !" అన్నది — ఈసారి ఆమె ఏడుపును దిగమింగుకోవటానికి ప్రయత్నించలేదు.

"ఏమైంది ?" ఆత్రంగా అడిగాను.

"ఆడు రాత్రంతా కొడుతూనే వున్నాడు బాబూ !"

ఆడంటే భర్తన్నమాట !

"దేనికి ?"

"నేను అప్సరసనంట... నా వెంట మొగవాళ్ళంతా పడతారంట ... నాకు నీతి లేదుట...జాతి లేదుట ... కిలాడీ దాన్నట...బజారు మనిషినట !"

ఒక్క-క్షణం నాగుమణి కళ్ళల్లోకి — పరిసరాలన్నీ చీకట్లు కమ్ముతున్నట్లు అనిపించగా — ఆ చీకట్లను చీల్చుకునేటందుకు కళ్ళు రెపరెపలాడిస్తూ చూశాను.

ఆమె ముఖంలోని కళ ఆమెలోని పవిత్రతకు చిహ్నంగా వెలిగిపోతున్నది. ఆమె పెట్టుకున్న కుంకుమబొట్టు ఆమెను అనుమానించిన వాళ్ళను, అవమానించిన వాళ్ళను భస్మంచేసే పరమాత్ముని మూడో నేత్రంలా వున్నది. ఆమె ముఖం అవమానంతో కుంచించుకుపోయినట్లున్నది. కోపంతో మండిపోతున్నట్లున్నది.

"మరి ఇక్కడ పని మానేయొచ్చు గదా !"

"అలా వీల్లేదు బాబూ ... కూలీ తేవాలి...దేనికదే !"

"అసలు ఎందుకొచ్చిందా అనుమానం అతడికి !" నాగుమణిని అనుమానిస్తున్నట్లుగా చూస్తూ అన్నాను.

"నా ఖర్మ ! లేకపోతే నే నందంగా వుండటం నా తప్పా ... అయినా నా

బొంద అందం...ఏ మందం...కాకిలా నల్లటిదాన్ని ..." కంఠంలో ఎంత లేదనుకున్నా రవ్వంత గర్వం తొణికిస లాడుతోంది. "చిన్నప్పటినుంచీ నేను కావాలనుకున్నవాడు వాడు ... మా అయ్యకీ, అమ్మకీ యిష్టంలేకపోయినా మా అత్త అడిగిందని చేసుకున్నాను."

"అతనూ ఇక్కడే వుంటాడా ? ఏం చేస్తుంటాడు ?"

"ఇక్కడే వుంటాడు ... మీకు తెలుసుగూడా బాబూ!"

"ఎవ్వరతడు ?" అదాట్టుగా అడిగాను.

"గణేషండీ !"

అదిరిపడ్డాను ... ఉత్తర దక్షిణ ధృవాల కలయిక... నింగి నేలా కలిసి పోయి గిరగిరా తిరిగిపోతున్నట్లని పిస్తోంది... ఆ అప్రాచ్యుశా నాగుమణి భర్త...ఇది భరించలేని చేదు నిజం... నా మొదటి చూపులోనే అతడంటే నాకు వెగటుభావం కలిగింది – అలాంటి వాడినా కావాలని పెళ్ళిచేసుకున్నది నాగుమణి !

మనుష్యుల తత్వాలు ఎంత విచిత్ర మయినవి ? నా కింకేం మాట్లాడాలో అర్థంకాలేదు. నా మౌనాన్ని గమనించి తను ఇంక చెప్పవల్సిందేం లేదన్నట్లుగా బయటకు వెళ్ళిపోయింది నాగుమణి.

మనస్సంతా అస్తవ్యస్త మయి పోయింది. ఆఫీసు పనిలోనూ మనస్సును లగ్నంచేయలేకపోయాను.

మధ్యాహ్నం రెండుగంటలప్పుడు వంగి వంగి నమస్కారాలు పెడుతూ గణేష్ వచ్చి నా గురించి స్తోత్రం మొదలుపెట్టాడు. "నన్ను మన్నిం చాలి ... మీరూ అందరులాంటివారే ననుకున్నాను ... మీలాంటివారు ఈ డిపార్టుమెంటులో వుండబట్టే నాలాంటి చిన్న చిన్న కంట్రాక్టర్లు ఇంకా బ్రతికి వుండగలుగుతున్నారు !"

నా వంటిమీద అతడి మాటలు కారం జల్లుతున్నట్లే వున్నది. గంయ్‌న లేచాను. "నీకు నిన్ననే చెప్పాను... లాస్ట్ పిల్లర్ దగ్గర ఎర్త్‌వర్క్ పూర్త యితేగాని నీ పాత బిల్లులు పాసు చేయను ... నిన్న వందమందిని తెస్తా నన్నాక ... యాభైమంది వచ్చా రన్నావ్ ... అసలు పదిమంది గూడా రాలేదట ..."

"సార్...సార్..."

"నీవు నాకేం చెప్పనక్కరలేదు... వెళ్ళిపో ఇక్కడనుంచి ముందు !"

నాగుమణిమీద జాలి అతడిమీద నాలో కఠినత్వాన్ని మరింత పెంచింది.

* * *

మరునా డుదయం నాగుమణి మరింత కుంచించుకుపోయి కనబడింది. నల్లటి ముఖంమీద మసిబూసినట్లున్నది. నాలుగు రోజులు లంఖణాలు చేసినట్లుగా పీక్కుపోయి వుంది. ఏడ్చి ఏడ్చి కనుగుడ్లు పొడుచుకు వచ్చినట్లుగా వున్నది.

రాత్రి నిద్రగూడా పోయినట్లు లేదు–

'గణేష్ మళ్ళీ కొట్టాడా ?'

నే నడిగినదానికి సమాధానంగా 'అవున'న్నట్లుగా తలఊపుతూ చేయి జాపి చూపించింది.

నల్లటి చారలు...కాల్చిన గరిటతో పెట్టిన వాతలు...

"నాగుమణీ!" ఆవేశంగా అన్నాను.

"అవును బాబూ..." నోటమ్మటి మాట రావటంలేదు.

"ఇంట్లోనుంచి వాడిని వెళ్ళగొట్టక ఎందుకు రానిస్తావ్?..."

"అలాచేస్తే ఇంకా నాశనమయి పోతాడు బాబూ వాడు......కావాలని వాడిని చేసుకొని అట్లా ఎట్లా వదిలేయ మంటారు !" ఆమె కళ్ళల్లో దిగుళ్ళ గూళ్ళు సుళ్ళుతిరగ్గా కదులుతున్న నీళ్ళు ఎర్రగా కనబడుతున్నయి. "వాడు మా మేనత్త కొడుకు...చిన్నప్పటినుంచి ఎంతో ప్రేమగా పెంచి చచ్చిపోతూ, చచ్చిపోతూ నాకు అప్పచెప్పింది— అన్నీ నేనే నంటూ ... చచ్చిపోతున్న అత్త చేతిలో చేయివేసి చెప్పాను !" అన్నది ఏడుస్తూనే.

నాగుమణిని చూస్తుంటే ఈ ప్రపంచ మంతా స్థంభించినట్లే అనిపిస్తోంది. నాకు ఈ క్షణాన ఆమెమీద ఎలాంటి కోరికలూ ఏర్పడటంలేదు. ఆమెను నేను కుటిలపు ఆలోచనలతో నా దాన్నిగా చేసుకోవాలనీ ఆమె అందాన్నంతా ఆస్వాదించాలనే తపనా నాలో లేదు...వెలిగిపోయే ఆమె కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూడాలనే ఆకాంక్ష నాకు లేదు—కాకపోగా నా హృదయ మంతా ఆమెమీద జాలితోనే నిండి పోయింది. ఆమె శరీరంమీద వాతలు నా శరీరంమీద వాతల్లాగానే నాకు బాధ కలిగిస్తున్నాయి...

"గణేష్‌ని పిలిపించి చివాట్లు పెట్ట మంటావా ?"

"వద్దండీ !" త్వరత్వరగా అన్నది.

"ఏం ?"

"వద్దు బాబూ వద్దు...నేను చెబు తున్నానుగదా వద్దు !"

"ఎందుకనని ?" గట్టిగా అడిగాను

ఒక్క క్షణం సూటిగా నా కళ్ళల్లోకి చూచి, రెండుచేతులూ జోడిస్తూ, "మీకు తెలియదు వాడి సంగతి...మనిద్దరికీ రంకు కట్టినా కట్టేంత దరిద్రుడు వాడు! అసలు వాడు అలాంటిదాని కోసరమే చూస్తున్నాడు బాబూ...మీరు వాడి బిల్లులేవో యివ్వటం లేదట...నన్ను అడ్డంపెట్టుకొని మిమ్మల్ని గోలచేసినా చేయవచ్చు...కాస్త జాగ్రత్తగా వుండండి బాబూ !" అన్నది.

నేను శిలే అయ్యాను.

నాగుమణి అక్కడ లేదు !

వచ్చిన కొద్దిరోజుల్లోనే నాకు ఎంతో ఆత్మీయంగా అగుపించిన నాగమణి అంటే ఇప్పుడు భయమేస్తోంది. నిన్నటి వరకు ప్రతి క్షణం ఆప్యాయంగా ఆ స్త్రీ కళ్ళల్లోకి చూడాలనుకున్న నేను ఇప్పుడు ఆమెను తప్పుకు తిరగటానికే తాపత్రయ పడుతున్నాను.

ఆమె నాగమణి—ఆమె భర్త ఒక నాగుపామయి ఆమెను మణిలా పెట్టుకొని నన్ను ఆడించ ప్రయత్నిస్తున్నాడు.

ఒక్కొక్కసారి అనుకుంటాను—చిదంబరంకు చెప్పేసి నాగమణిని ఇంకోపనికి పంపి మరొకరిని నా దగ్గర వేసుకుందామా అని !

చిదంబరం ఎందుకూ అంటే—తీగంతా కదిలించాలి...డొంకా కదులు తుంది...లేనిపోని రభస...

అసలు నాగమణిని పూర్తిగా మాని పించేయవచ్చు...అది తేలిక గూడా.. అదే అన్నాను గూడా నాగమణితో.

భోరున ఏడ్చేసింది "నేను మీకంతా చెప్పేశానని నన్ను చంపేస్తాడు బాబూ !"


క్షణం నాలో ఓ అనుమానం లీలగా మెదిలింది.

నేను నాగమణిని నమ్మవచ్చా ?... నేను విషవలయంలో చిక్కుకున్నానా అనిపించింది నాకు...అర్థం గాని తపన

సరిగ్గా అటువంటి సమయంలోనే మనస్సును ఊరట కలిగించేలా ఆఫీసు పనిమీద ప్లాన్లు, ఎస్టిమేట్లూ తీసుకొని—హైద్రాబాద్ వెళ్ళి ఓ పదిహేనురోజులు ఉండిరమ్మంటూ ఉత్తర్వులు వచ్చినయి...

థాంక్ గాడ్...నాలుగు రోజుల తరువాత రిలీవర్ వచ్చే రోజునే నా ప్రయాణం గూడా పెట్టేసుకున్నాను.

తరువాత అనుకున్నట్లుగానే నాలుగో రోజునే వెంకట్రావు మసూలా నుండి వచ్చాడు. విజయవాడలో యీయన్ని కలసి మరునాడుదయాన సైట్‌కి వెళ్లే



టప్పుడు పికప్‌చేసుకు వెళ్ళమని నాకు కబురు పంపించాడు.

ఎనిమిదిగంటలకల్లా వెంకట్రావును తీసుకొని రామాపురం బయల్దేరాను... మోటార్ బైక్ మీదే చాలావరకు వివరాలు, పరిసరాలు చెప్పాను.

నాగమణి సంగతి చెప్పి గణేష్‌నుండి జాగ్రత్తగా వుండమని కూడా హెచ్చరిద్దా మనుకున్నాను.

మేం ఆఫీసు దగ్గరకు వెళ్ళేటప్పటికి ఇంకా చిదంబరంగాని, హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ గాని స్టాఫ్‌గాని వచ్చినట్లుగాకనబడలేదు.

లోపలికి వెళ్ళి కూర్చున్నాను. ఎదురుగ్గా వెంకట్రావ్ !

బెల్‌కొడితే నాగమణి వస్తుందేమో కాఫీ తెప్పించుకోవచ్చు అనుకున్నాను. నాగమణే వచ్చింది...కానీ ఎడమకంటి మీదగా పెద్దకట్టు.

"ఏమైంది ?...ఏమైనా పొడుచు కుందా ?" ఆదుర్దాగా అడిగాను.

"లేదు బాబూ !"

"మరి ?"

మాట్లాడకుండా బయటకు వెళ్ళి పోయింది.

గణేష్ కోపంతో ఆమె కంటిని పొడిచేయలేదుగదా...చ టుక్కున లేచి ఆవేశంగా బయటకు వచ్చాను... గణేష్‌ను చంపేయాలి . దొంగరాస్కెల్. జీవితాలతో చెలగాటమా...

నాగమణి స్తంభం పక్కన నిలబడి వున్నది ... ఏడుస్తున్నదేమో బెక్కు వస్తోంది...

ఇది గణేష్‌పనేనన్న మాట !

"ఏమైంది నాగమణీ !"

నేను లేచివస్తా ననుకోలేదేమో... నా కంఠం వింటూనే ఉలిక్కిపడి నా వైపుకు తిరిగి నా కాళ్ళదగ్గర కూలబడిపోయింది పెద్దపెట్టున ఏడుస్తూ.

"ఏమైంది ?..."

"నా అందమేగదా బాబూ నన్ను హింసిస్తోంది... ఆ అందం నా కెందుకు బాబూ... ఆ వెధవ అందం లేకపోయినా నా బ్రతుకు సుఖంగా వెళ్ళిపోతేచాలు... అందుకే... అందుకే... జిల్లేడుపాలు

ఒక కంట్లో పోసేసుకున్నాను బాబూ... నా బ్రతుకు బ్రతకటానికి ఒక్క కన్ను చాలు బాబూ...రోజూ పెట్టే ఈ వాతల కంటే అదే పదివేలు..." ఏడుస్తూనే వున్నది.

ఘోరం... ఘోరం... ఘోరం దేవుడూ... నీవు జన్మ ఇచ్చిన మనుష్యులను ఇలాగా చూసేది?!

* * *

అనుకున్నట్లుగానే పదిహేను రోజుల తర్వాత హైద్రాబాద్‌లో పని పూర్తి చేసుకొని విజయవాడ వచ్చాను. ఆ రోజంతా రెస్టుతీసుకొని మరునాడుదయాన రామాపురం బయల్దేరాను

హైద్రాబాద్‌లో వున్న పదిహేను రోజుల్లో అప్పుడప్పుడూ నాగుమణి గుర్తుకు వచ్చినమాట వాస్తవమేగాని విజయవాడ వచ్చినప్పటినుండి ఆమెను ఎప్పుడు చూద్దామా అని మనస్సు తహతహలాడుతుంది.

జీవితంలో అతి కొద్ది సుఖానికి గాను తన అందాన్నే శాశ్వతంగా పణంపెట్టిన ఆమె అంటే నాలో గౌరవం, జాలి, అభిమానం మహోన్నతంగా పెరిగిపోయినయి. అందవికారంగా తయారయిన ఆమె బ్రతుకులో ఆమె కోరే జీవితపు మల్లెలు విరబూస్తే ఎంత బాగుంటుంది ?

దూరంగా కృష్ణ యినుకలో పైపైకి లేస్తున్న కాంక్రీటు స్తంభాలు... వందల సంఖ్యలో అటూ ఇటూ తిరుగుతున్న ఆడా మగా కూలీలు ... కాంక్రీట్ మిక్చర్స్... ట్రక్కులు... ఆకాశంలో పైపైకి పరుగెడుతున్న తెల్లటి కొంగల గుంపులు...

జావా స్టాండు వేస్తుండగానే చిదంబరం వచ్చాడు, "ఎప్పుడు వచ్చారు ?" అంటూ.

వెనగ్గా గణేష్ ... బొమ్మల చొక్కా.... రేగిన జుట్టు... కారాకిళ్ళీ నములుతూ మంచి హుషారుగా వున్నాడు. ''నమస్తే సార్'' అంటూ విష్ చేసాడు.

నా ఊహ నిజమే అయితే— అతడి బలనహీనపు మనస్సుకు నాగుమణి త్యాగం ఒక మంచి టానిక్కే అయింది. ఆమెను గురించి అనుమానపడి ... మానసికంగా బాధపడి ... ఆమెను హింసించాల్సిన అవసరం ఇక అతడికి లేదు.

అతడికి కావల్సిన నాగుమణి వున్నది.

అతడికి చికాకు కలిగించే ఆమె అందం ఈనాడు లేదు.

నాగుమణిని ఒక్కసారి బాగున్నారా అని అడిగి— అతడి పాతబిల్లులన్నీ వెంటనే పాసుచేయా లనిపించింది. బ్రతకవోయి సుఖంగా...!

"చిదంబరం! వర్క్ ఎలా సాగుతోంది ?"

"అంతా ఆల్‌రైట్ సార్ ... మంచి ప్రోగ్రెస్‌లో వున్నది ... మొన్న యీ యీ గారు కూడా కాంప్లిమెంట్స్ యిచ్చి వెళ్ళారు !

లోపలికి వెళ్లాను.వెనగ్గా చిదంబరం, గణేష్ వచ్చారు. ఎదురుగ్గా ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు. ఇప్పుడు ఎదురుగ్గా గణేష్ కూర్చున్నా నా మనస్సుకు అంత కష్టంగా లేదు.

అవును–నాగుమణి కనబడలేదు ... నలువైపులా ఒక్కసారి పరికించి చూస్తే నాగుమణి లేని ఆ పరిసరాలు బోసిగా కనబడినయి.

"నా బిల్లులు సార్... చాలా రోజు లయిపోయింది సార్ !

"ఎన్ని వున్నయ్యేం?"

"ఏదీ... మీరు వెళ్ళిం తరువాత ఒక్క బిల్లూ పాసుకాలేదు సార్!"

"చిదంబరం ! నిజమేనా ?"

"అవునండీ... మీ రొస్తేనేగాని నే నివ్వనన్నాను."

"సరే. సాయంత్రం మూడు గంటలకి రా ... అన్నీ చూస్తాను ... ఇక వెళ్ళు !"

గణేష్ వెళ్ళిపోయాడు.

నాగుమణి కనబడలేదు.

చిదంబరం ఆఫీసులో ఈ పదిహేను రోజులలో జరిగిన విషయాలు విపులంగా చెపుతున్నా అవి నా మనసుకు ఎక్కడమే లేదు.

నాగుమణి ఎక్కడ ? నాగుమణి ఎక్కడ ?

నా మనస్సు అన్నివైపులకూ పరుగెడుతోంది.

చిదంబరం పావుగంట చెప్పి చెప్పి వెళ్ళిపోయాడు.

నాకు పెద్ద రిలీఫ్....

ఖాళీ గది.

అటువంటి సమయంకోసమే ఎదురు చూస్తున్నట్లుగా నాగుమణి గదిలో కాలు పెట్టింది.

నా కళ్ళు విశాలమయి వెలుగు నింపుకున్నాయి ఆమె రాకకు... కానీ ఆ వెలుగు ఒక్క క్షణమే వున్నది !

—ఎందుకనో నాగుమణి మొహం మరింత దిగులుతో కుంచించుకుపోయి వున్నది.... జీవకళపోయి పీక్కుపోయి అసహ్యంగా తయారయింది. సరిగ్గా వున్న కన్నూ లోపలికి పోయి ఎక్కడో నిలువులోతు ఖావిలో రాత్రిపూట కనబడే నీళ్ళలా అస్పష్టంగా వున్నది...నున్నటి చెంపలు ముడతలుపడి జిడ్డు గారుతున్నాయి.

జబ్బుపడలేదుగదా...

—పదిహేను రోజుల క్రితం నేను చూసిన నాగుమణి కాదు ఈమె ... ఆమె తిండిలేక చావగా... శవం లేచి వచ్చినట్లున్నది.

"ఏమైంది !" నీరసంగా దిగులుగా ... నా కలలన్నీ కల్లలవ్వగా... భయం భయంగా అడిగాను.

"ఏం చెప్పమంటా రయ్యా... నే నందంగా వున్నా ననేగదా ఇన్నాళ్ళబట్టి వాడు నన్ను చిత్రహింస పెట్టింది... ఆ అందం పోతేనైనా సుఖమైన బ్రతుకు బ్రతుకుతానేమోనని కన్నుగూడా పోగొట్టుకున్నాను. .. కన్ను పోంగా, సుఖమూ రాకపోంగా...నేను అసహ్యంగా వున్నానని వాడు నన్ను వదిలేసి మరో దాన్ని కట్టుకున్నాడు బాబూ... ఇలా నవ్వులపాలయింది బాబూ నా బతుకు.. ఏం చెప్పమంటారు ! నా జీవితం ఇక అయిపోయింది బాబూ..."

ఆమె ఏడుపుకు ఆ గది మొత్తం మొగజాతినే శపిస్తున్నట్లుగా ప్రతి ధ్వనిస్తోంది !